

హుస్నాబాద్‌లో నీటిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు

అతలాకుతలం

పలుచోట్ల గాలివాన బీభత్సం

తడిసిముద్దయిన ధాన్యం

రాలిన మామిడికాయలు

ఎగిరిపోయిన పైకప్పు రేకులు

పలుచోట్ల విరిగిపడ్డ చెట్లు

హుస్నాబాద్/ధూళిమిట్ట/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉదయం నుంచి భానుడు భగ్గుమనగా, మధ్యాహ్నం దాటాకా పలుచోట్ల మబ్బులు కమ్ముకున్నాయి. సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. హుస్నాబాద్, ధూళిమిట్ట, జగదేవ్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. అన్నదాతలను అతలాకుతలం చేసింది. హుస్నాబాద్ పట్టణంలో సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని వందల క్వింటాళ్ల ధాన్యం తడిసిముద్దయింది. వరద నీటికి కొట్టుకపోయింది. కళ్లముందే తమ కష్టారిజతం నీటిపాలవుతుంటే రైతులు తల్లడిల్లిపోయారు. సమయానికి కొనుగోలు చేయకపోవడంతో పాటు ధాన్యం కొనుగోలు చేసే యార్డులో ఎప్పటికప్పుడు తాలును శుభ్రం చేయకపోవడంతో కట్టలాగ మారి నీరు నిలిచిపోయి వడ్ల కుప్పలు అందులో మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నియోజకవర్గ బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ తదితరులు పరిశీలించారు. హుస్నాబాద్ పట్టణంలో కస్తూర్బా కాలనీలో చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. రామవరం చౌరస్తాలోని మల్లెచెట్టు వేర్లతో సహా కూలింది. పలుచోట్ల పైకప్పు రేకులు కొట్టుకపోయాయి. ధూళిమిట్ట మండల కేంద్రంతో పాటు జాలపల్లి, తోర్నాల, బెక్కల్ గ్రామాల్లో మామిడికాయలు రాలిపోయాయి. ధూళిమిట్ట, జాలపల్లిలో ఇంటిపైకప్పు రేకులు ఎగిరిపోయాయి. జగదేవ్‌పూర్ మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, దౌలాపూర్, మునిగడప, వట్టిపల్లి, లింగారెడ్డిపల్లి, టీసీ వెంకటాపూర్, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో మామిడితోటలో మామిడికాయలు నేలరాలాయి. జగదేవ్‌పూర్‌లో హోల్‌సెల్ చెప్పుల దుకాణం కుప్పకూలి లక్ష వరకు నష్టం వాటిల్లింది. కూరగాయల మార్కెట్‌లో చెట్లు నేలకొరిగాయి. దౌలాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన గుడిసె కవర్ లేచిపోయింది.



జగదేవ్‌పూర్‌లో



హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం, జగదేవ్‌పూర్‌లో ఎగిరిపడిన చెప్పుల దుకాణం రేకులు

ఎండలు మండేలా

కోహీర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో సోమవారం ఏకంగా 110 గ్రామాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా టేక్మాల్‌లో 42.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత, సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేటలో 41.9, సంగారెడ్డి జిల్లా వట్టిపల్లిలో 41.1 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలో బోడగట్ 42.2, శంకరంపేట్ (ఎ) 42.2, రాజ్‌పల్లి 42.2, మెదక్ 42.1, వడ్డీ4 42.1, దామరంచ 42.1, కౌడిపల్లి 42.1 చిట్కుల్ 42.0 నార్లపల్లి 42.0 బుజ్జారంపేట్ 42.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని గండిపల్లి 41.9, పోతిరెడ్డిపేట్ 41.7, పెద్దకోడూరు 41.7, చీకోడు 41.6 రేబర్తి 41.5, అబ్బీపూర్ 41.5 నారాయణరావుపేట్ 41.4, హుస్నాబాద్ 41.4 తుక్కాపూర్ 41.3, అంగడికిష్టాపూర్ 41.3, రాంపూర్ 41.2, తిప్పారం 41.2, కట్కూరు 41.2 చిట్యాల 41.2, బేగంపేట్ 41.1, శనిగారం 41.1 బెజ్జంకి 41.1 కోహెడ 41.1 సిద్దిపేట 41.0 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లాలో వట్‌పల్లి 41.1, గుమ్మడిదల 41.1, కడ్పల్ 41.1, రుద్రారం 41.0, కంది 41.0 డిగ్రీలు నమోదయ్యాయి.



భూ భారతితో భరోసా

అవగాహన కల్పిస్తున్న అధికారులు

నూతన ఆర్వోఆర్ చట్టం గురించి వివరణ

పరిష్కారం కాకుంటే అప్పీల్‌కు అవకాశం

నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 21 : భూములకు రక్షణ కల్పించడంతో పాటు, భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంచడం, సమస్యలను సత్వరమే పరిష్కరించేలా, సులభమైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'భూ భారతి'ని అమలులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు మండలాల్లో కొనసాగిస్తుండగా, అక్కడి సూచనలను పరిగణలోకి తీసుకుని, జూన్ 2న రాష్ట్రమంతటా అమలుకు శ్రీకారం చుట్టనున్నది. అందులో భాగాంగానే జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 17 నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లాస్థాయి అధికారులు రైతులకు భూ భారతి, నూతన ఆర్వోఆర్ చట్టం గురించి వివరిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

భూ భారతి ఎలా పనిచేస్తుంది..

నూతన ఆర్వోఆర్-2025 (రికార్డ్స్ ఆఫ్ రైట్ ఇన్ ల్యాండ్) చట్టాన్ని ఈ ఏడాది జనవరి 9న రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు రాగా, భూ భారతి పోర్టల్‌ను వారం క్రితం ప్రారంభించారు. దీని ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో భూ సమస్య ఉన్నవారు దాని పరిష్కారం కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి, సమస్య పరిష్కారానికి ఎన్ని రోజులు సమయం పడుతుంది, ఒకవేళ పరిష్కారం కాకపోతే అప్పీల్‌కు ఎలా వెళ్లాలి అనే దానిపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన రైతులు, ప్రజలు నూతన చట్టం ద్వారా దరఖాస్తును చేసుకునే వీలును కల్పించింది. దరఖాస్తు తహసీల్దార్ వద్ద పరిష్కారం కాకపోతే ఆర్డీవో, కలెక్టర్ ద్వారా సమస్యను పరిష్కరించుకునేలా ప్రభుత్వం వారికి అధికారాలను అప్పగించింది. ఒకవేళ వారు తీసుకున్న నిర్ణయం సరియైనది కాకుంటే, అప్పీల్ కోసం ల్యాండ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించేలా వెసులుబాటును కల్పించింది. ఒకవేళ అక్కడ ఏమైనా అభ్యంతరాలుంటే అప్పుడు సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని చట్టంలో పేర్కొన్నారు. దీంతో పాటు ప్రతీ మనిషికి ఆధార్ ఉన్నట్లే ప్రతి భూమికి కూడా భూదార్ కార్డు అందించనున్నట్లు తెలిపారు.

సాదాబైనామాలు, వారసత్వ భూములు

కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలు, వారసత్వ భూములకు ప్రభుత్వం పోర్టల్‌లో వెసులుబాటు కల్పించింది. స్లాట్ బుకింగ్ చేసిన తరువాత ప్రభుత్వం నిర్ణయించిన మ్యుటేషన్ ఫీజును చెల్లించాలి. ఆ తరువాత వారసత్వం ద్వారా సంక్రమించిన భూమికి స్థానిక తహసీల్దార్ వివరాలు సేకరణ చేసిన తరువాత విచారణ జరిపి భూ హక్కుల రికార్డుల్లో మ్యుటేషన్ చేయనున్నారు. దాంతో పాటుగా సాదాబైనామా కింద ఉన్న భూములను సర్వే చేసి, వివరాలు సేకరించి నిర్ధారణకు వచ్చిన తరువాత వాటిని క్రమబద్ధీకరించేలా భూ భారతి పోర్టల్‌లో రూపకల్పన చేశారు.

9 లక్షల ఎకరాల విస్తీర్ణం

జిల్లా విస్తీర్ణం 9,12,947 ఎకరాలు కాగా, దీనిలో అటవీ విస్తీర్ణం 52,380 ఎకరాలు, సాగుకు యోగ్యమైన భూమి 7,01,902 ఎకరాలు కాగా, సాగుకు యోగ్యం కానిది 44,152 ఎకరాలుగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతిలో మ్యాడుళ్లను కుదించారు. గతంలో 33 మ్యాడుళ్లు ఉండగా ప్రస్తుతం భూభారతిలో రిజిస్ట్రేషన్, ఆర్‌వోఆర్, మ్యుటేషన్, అప్పీల్, నిషేధిత భూములు వాటిని ప్రత్యేక మాడ్యుళ్లను పొందుపరిచారు. దాంతో పాటుగా దరఖాస్తు చేసుకున్న వారికి దరఖాస్తు స్థితిగతి, ట్రాకింగ్ తదితర సేవలపై వారి మొబైల్‌కే మెస్సెజ్ (ఎస్ఎంఎస్) ద్వారా వివరాలను పంపించనున్నది. గతంలో 32 కాలమ్‌లతో పహణీ ఉండగా, ప్రస్తుతం 11 కాలమ్‌లతో పహణీ అందించేలా పోర్టల్‌లో పొందుపరిచారు.

భూసమస్యల పరిష్కారానికే 'భూ భారతి' : కలెక్టర్

మిరుదొడ్డి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి' పోర్టల్‌ను తీసుకొచ్చిందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మిరుదొడ్డి రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన చట్టంలోని వివిధ అంశాలపై రైతులకు, ప్రజలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈనెల 14న భూ భారతి వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉండడం కోసం పోర్టల్‌లో మార్పులను చేశామని, సాదాబైనామాలకు వెసులుబాటు కల్పించామని తెలిపారు. భూమికి భూధార్ కార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్న అధికారుల దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టరు అబ్దుల్‌హమీద్, ఆర్డీవో సదానందం, మండల ప్రత్యేకాధికారి గణేష్‌రామ్, తహసీల్దారు ఉదయశ్రీ, ఎంపీడీవో గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి రైతువేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రజావాణికి 44 ఫిర్యాదులు



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 44 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ మనుచౌదరి, డీఆర్డీఏ పీడీ పీడీ జయదేవ్ ఆర్యా తదితరులు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. వారు ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అయితే, ప్రజావాణి కార్యక్రమం కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 10.30కు ప్రారంభించాల్సి ఉండగా 10.45 వరకు డీఆర్డీఏ పీడీ ఒకరే వచ్చారు. 10.50కి ఏవో అబ్దుల్ రహమాన్ రాగా, వారు వినతులను స్వీకరించడం ప్రారంభించారు. కలెక్టర్ మాత్రం 11.18కి వచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్‌లో వసూల్ రాజాలు

సబ్సిడీ రుణం ఇప్పిస్తామని

డబ్బు తీసుకున్న సిబ్బంది

ఫోన్ పే ద్వారా నగదు పంపిన బాధితుడు

అయినా.. మంజూరు కానీ కార్పొరేషన్ రుణం

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఉపాధి కల్పించేందుకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తుంది. గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుంచి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఎస్సీ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కార్పొరేషన్ లోన్ మంజూరు చేపిస్తామని డబ్బులు వసూలు చేశారు. ఓ బాధితుడు 2020-21 సంవత్సరంలో రూ.8 లక్షల రుణంతో మోటార్ క్యాబ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దాదాపు రూ.5 లక్షల వరకు సబ్సిడీ వస్తుందని, రుణం మంజూరు చేపిస్తామని రూ. 80 వేల వరకు ఖర్చు అవుతుందని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చెప్పారు. మొదటి విడతగా రూ.30 వేలు ఇవ్వాలని అనగా, వారికి ఫోన్ పే ద్వారా నగదును పంపించారు. అయినా, రుణం మంజూరు కాలేదు. గతంలో దరఖాస్తు చేసుకున్న కార్పొరేషన్ రుణాలన్నీ ప్రభుత్వం రద్దు చేసిందని, ఇప్పుడు వచ్చే రాజీవ్ యువ వికాసంలో మంజూరు చేపిస్తానంటూ కాలయాపన చేశాడు. అతడిని నిలదీయగా, డబ్బులు ఇవ్వము... ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బాధితుడిని భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం.

ప్రజావాణిలో ఫిర్యాదు

డబ్బులు తీసుకొని ఇప్పటివరకు సబ్సిడీ రుణం మంజూరు చేయించకపోవడంతో వారిపైన బాధితుడు, ఆయన భార్య ప్రజావాణిలో కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బాధితుడు ఇచ్చిన డబ్బులు వెంటనే రికవరీ చేసి, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏవో అబ్దుల్ రహమాన్‌ను ఆదేశించారు. ఇదే విషయంపై 'ఆంధ్రజ్యోతి' కలెక్టరేట్ ఏవోను ఫోన్ ద్వారా సంప్రదించగా ఫిర్యాదు విషయం వాస్తవమేనని, ఆ డబ్బును రికవరీ చేసేందుకు ఒకరోజు గడువు ఇచ్చామని తెలిపారు. రికవరీ చేసి నగదును బాధితులకి అందిస్తామని, వసూలుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ఫోన్ పే ద్వారా పంపిన నగదు

ఎట్టకేలకు కొండపాక ఏఎంసీ కమిటీ ఏర్పాటు

కొండపాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) పాలకవర్గం ఏర్పాటుకు దశాబ్దకాలం నిరీక్షణకు తెరపడింది. ఆదివారం ప్రభుత్వం కొండపాక ఏఎంసీ కమిటీని ప్రకటించింది.

కొండపాకలో పదేళ్ల తర్వాత

కొండపాక మండలం మార్కెట్ కమిటీ 2014లో ఏర్పాటయింది. సుమారు మూడు కోట్ల వ్యయంతో మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు గోదాములను కొండపాకలో నిర్మించారు. కొండపాక మండలం దొమ్మాట నియోజకవర్గంలో ఉన్న సమయంలో తొగుట మార్కెట్ కమిటీ పరిధిలో ఉండేది. కొండపాక మండలం గజ్వేల్ నియోజకవర్గంలో కలిసిన తర్వాత గజ్వేల్ మార్కెట్ పరిధిలోకి వెళ్లింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం దాదాపు అన్ని మండలాల్లో మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసింది. అందలో భాగంగా కొండపాక మార్కెట్ ఏర్పాటయింది. అప్పుడు అంతటా పాలకవర్గాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కొండపాక మండలంలో మాత్రం చేయలేదు. కొండపాక మండల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయించారు. పార్టీ నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో సాధ్యం కాలేదు. తదనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుగా, సంవత్సరం తర్వాత పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు.



కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం

చైర్మన్‌గా విరుపాక శ్రీనివాసరెడ్డి

కొండపాక మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం కొండపాక మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా విరుపాక శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా బట్టు పరశురాములు, డైరెక్టర్లు, నలుగురు ఎక్స్ ఆఫీషియో మెంబర్లతో కమిటీని ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్ డైరెక్టర్లు సోమవారం అధికారికంగా రిజిస్టర్‌లో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు.

వంటిమామిడి ఏఎంసీ పాలక మండలి బాధ్యతల స్వీకరణ

ములుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం వంటిమామిడి మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్ భార్య విజయతో పాటు 18 మంది సభ్యులతో పాలకవర్గాన్ని నియమించింది. ఈ మేరకు సోమవారం ఉదయం వంటిమామిడి మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్‌గా విజయ బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి రేవంత్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అలాగే వైస్ చైర్మన్‌గా కొడిత్యాల ప్రభాకర్(బహిలింపూర్), పలు గ్రామాల నుంచి డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారు బాధ్యతలు స్వీకరించారు.



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ

ఓపెన్ పరీక్షల్లో రెండోరోజు 10 మంది డిబార్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ థియరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. రాష్ట్రస్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సోమవారం ఆర్‌సీపురం, పటాన్‌చెరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా కాపీయింగ్‌కు పాల్పడిన 10 విద్యార్థులను డిబార్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఓపెన్ టెన్త్ 9, ఇంటర్మీడియట్ 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12 వరకు జరిగిన ఇంటర్మీడియట్ ఆంగ్లం సబ్జెక్టు పరీక్షకు 3,762 మందికి 3,400 మంది హాజరుకాగా, 262 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన టెన్త్ ఐసీహెచ్ పరీక్షకు 50 మంది హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లిన యువతి అదృశ్యం

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జ్వరం వచ్చిందని రెండురోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన గుర్రం రేవతి(18) మనోహరాబాద్ మండలం రామయపల్లిలోని ఓ పరిశ్రమలో కార్మికురాలుగా పనిచేస్తుంది. పదేళ్ల క్రితం తల్లిదండ్రులు మృతిచెందడంతో.. ఇదే గ్రామంలో పెద్దనాన్న కూతురైన బుచ్చమ్మ దగ్గర ఉంటుంది. పదిహేను రోజులుగా పెళ్లి సంబంధాలు చూస్తుండగా ఈనెల 19న జ్వరం వచ్చిందని తూప్రాన్ ఆస్పత్రికి వెళ్లొస్తానని చెప్పింది. రెండురోజులైనా తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. మేనమామ కోదాస్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కిష్టాపూర్‌లో ఒకరు..

చేగుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంట మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన మందాపురం కిష్టారెడ్డి (59) ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లాడు. 20 రోజులైనా తిరిగిరాకపోవడంతో భార్య శోభ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య


మృతిచెందిన ఆంజనేయులు

పాపన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని బాచారంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రావుగారి ఆంజనేయులు(40) కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్ల కిందట ఇంద్రేశంలో రేకుల ఇళ్లు నిర్మించుకున్నాడు. నిర్మాణం కోసం కొంత అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 19న గ్రామంలో బంధువుల ఫంక్షన్‌లో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చాడు. అదేరోజు సాయంత్రం గ్రామ శివారులోని చేను వద్ద పురుగు మందు సేవించాడు. అటువెళ్లిన వారు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమిం సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

పటాన్‌చెరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసగా మారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన రావుగారి ఆంజనేయులు(40) కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్ల కిందట ఇంద్రేశంలో రేకుల ఇళ్లు నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం కొంత అప్పు అయింది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 19న గ్రామంలో బంధువుల ఫంక్షన్‌లో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చాడు. అదేరోజు సాయంత్రం గ్రామ శివారులోని చేను వద్ద పురుగు మందు తాగాడు. అటుగా వెళ్లిన వారు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు కూతురు, ఇద్దరు కుమారులు, ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భార్యతో గొడవపడి..

ఐడీఏబొల్లారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఐడీఏబొల్లారం పురపాలక పట్టణ పరిధి జీఎంఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కూర్మయ్య(39) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం సమయంలో భార్య ఎల్లమ్మతో కుటుంబ సమస్యలపై గొడవ పడ్డారు. దీనిపై మనస్తాపం చెందిన కూర్మయ్య చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెల్దుర్తి మండలం మానెపల్లి గ్రామానికి చెందిన చౌదరిపేట రాగిరి(50) తన కున్న పొలం వద్ద ఇటీవల బోరు వేయించగా.. ఫెయిల్ అయ్యింది. దీనికితోడు పంటకు సరిగ్గా నీరు అందక ఎండిపోయింది. చేసిన అప్పులు అధికమవడంతో 17న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి నర్సాపూర్ ఆసుపత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య నర్సమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మద్దూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బొడ్రాయి పండుగరోజు విషాదం చోటు చేసుకున్నది. విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని లద్నూరులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ యాదగిరి బతకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. కాగా గ్రామంలో బొడ్రాయి పండుగకు కుటుంబంతో ఇంటికి వచ్చాడు. ఇంట్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండటంతో సాయంత్రం సరిచేసేందుకు వెళ్లిన యాదగిరి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే గమనించిన కొందరు 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వ్యక్తి కత్తితో కడుపులో పొడుచుకోగా.. పేగులు బయటపడ్డాయి. ఈ సంఘటన శివ్వంపేట మండలం పరిధిలోని బోజ్యాతండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన గుగులోత్ విఠల్(55) మద్యం మత్తులో కుటుంబసభ్యులతో గొడవపడి కడుపులో పొడుచుకున్నాడు. దీంతో పేగులు బయటపడ్డాడు. కుటుంబీకులు గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న కంకులు దగ్ధం

కంగ్టి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మొక్కజొన్న కంకులు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఘన్‌పూర్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన భగవాన్ సయ్యద్ నాలుగురోజుల క్రితం మొక్కజొన్న కంకులు కోసి ఎండబెట్టేందుకు పొలంలో ఉంచాడు. తిరిగి సోమవారం ఉదయం పొలానికి వెళ్లి కూడగా కంకులు కాలిపోయి ఉన్నాయని వాపోయాడు. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంట కాలిపోవడంతో సుమారు రూ.50 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం పరిహారం అందించాలని సయ్యద్ కోరారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డిమోపులు దగ్ధం

వెల్దుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ గ్రామం వద్ద చోటు చేసుకుంది. మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎల్లాగౌడ్ ట్రాక్టర్‌లో గడ్డి మోపులను తరలిస్తుండగా ఉప్పులింగాపూర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న 200 మోపుల గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న మెదక్ అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేశారు.

పాఠశాల హెచ్‌ఎం గైర్హాజర్

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలకు గైర్హాజరైన సంఘటన పోతులబోగుడ పాఠశాలలో సోమవారం చోటు చేసుకుంది. శివ్వంపేట మండల పరిధిలోని పోతులబోగుడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మానసకుమారి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అయ్యారని మాజీ స్కూల్ చైర్మన్ బాలకృష్ణ, అంజనేయులు తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు సంప్రదించగా.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది కలిగేలా విగ్రహాలు ఏర్పాటు చేయొద్దు

కొల్చారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇబ్బంది కలిగేలా విగ్రహాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోకి వెళ్లే నడిరోడ్డుపై అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్ మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు. అందరూ కలిసి ఉండాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. కొల్చారంలో అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను సోమవారం పరిశీలించి, మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేశారు.

కుంట వద్ద తవ్వకాలపై జాయింట్ సర్వే


సర్వే నిర్వహిస్తున్న ఇరిగేషన్ అధికారుల బృందం

మాసాయిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరి కుంట వసానికుంట పక్కనే ఏర్పాటు చేసిన వెంచర్‌లో అక్రమంగా తవ్వకాలు జరిపి, కాలువలకు అడ్డంగా మట్టి నింపడంపై సోమవారం ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించారు. మండలంలోని బొమ్మారం గ్రామ కుమ్మరికుంట, మాసాయికుంట వద్ద అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపణలు రావడంతో జాయింట్ సర్వే చేసి, వెంచర్ యాజమానికి నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో జ్ఞానజ్యోతి, ఆర్ఐ దన్‌సింగ్, సర్వేయర్ నరసింహులు, మైనింగ్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన

పుల్‌కల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన గేటు వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరవధిక సమ్మెకు దిగారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా సోమవారం జేఎన్టీయూ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్రంలోని 12వర్సిటీలలో 1,445 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా బోధన చేస్తున్నారని తెలిపారు. నెల రోజులుగా వివిధరూపాల్లో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తూనే సమ్మెకు దిగారు. దీంతో ఇంజనీరింగ్ కళాశాలలో తరగతుల నిర్వహణకు బ్రేక్ పడింది. యూనివర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయాలని, ప్రొఫెసర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంటలు ఎలా ఉన్నాయ్..

ఇక్రిసెట్ శాస్త్రవేత్తలతో కలిసి సౌదీ రైతుల పర్యటన


స్థానిక రైతులతో ఇక్రిసెట్ శాస్త్రవేత్తలు, సౌదీ రైతులు

కొండాపూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటల సాగు పద్ధతిని తెలుసుకునేందుకు ఇక్రిసెట్ శాస్త్రవేత్తలతో కలిసి సోమవారం సౌదీ అరేబియా రైతులు హరిదాస్‌పూర్‌లో పర్యటించారు. వరి, జొన్న పంటల సాగు పద్ధతి, పెట్టుబడి, కూలీల ఖర్చులు, దిగుబడి, మార్కెటింగ్ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. పంట సాగులో విత్తనాలు, ఎరువులు మందుల వినియోగం, అధునిక పద్ధతి, సబ్సిడీలు, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అవశాలను తెలుసుకున్నారు. వారి వెంట ఏడీఏ వెంకటలక్ష్మి, ఏవోలు గణేష్, ప్రతిభ, ఏఈవో రవి, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు నర్సింహులు, కరణ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మెడికల్ షాపులను తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్


మెడికల్ షాప్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

శివ్వంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెడికల్ షాపులను సోమవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ పరిశీలించారు. జనూష మెడికల్ జనరల్ స్టోర్, పవన్ శృతి, శ్రీనివాస మెడికల్ స్టోర్లను ఆమె పరిశీలించారు. ఓ మెడికల్ జనరల్ స్టోర్‌లో ఫార్మసిస్ట్ లేకపోవడం, మెడికల్ షాపుల్లో సరైన రిజిస్టర్ నిర్వహణ లేకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా చంద్రకళ హెచ్చరించారు.


మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ కుటుంబానికి బెనిఫిట్స్ పత్రాలను అందజేస్తున్న సీపీ

కానిస్టేబుల్ కుటుంబానికి బెనిఫిట్స్

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ కుటుంబ సభ్యులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సోమవారం సీపీ డాక్టర్ బి. అనురాధ అందజేశారు. పోలీస్ శాఖ నుంచి వచ్చిన రూ. 16 లక్షల చెక్కులను ఆమె నవీన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ విధినిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు తమ శాఖ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, సూపరింటెండెంట్ మహమ్మద్ ఫయాజుద్దీన్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవిరాజు, సీసీ నితిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసలే నీటి కొరత.. జీపీ ట్రాక్టర్‌తో సీసీ రోడ్డుకు నీరు



మిరుదొడ్డి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి కోసం జనం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం ప్రజల అవసరాలు కాదని, సీసీ రోడ్డుకు ఏకంగా గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో నీటిని అందించారు. వివరాల్లోకి వెళ్లితే.. దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మిస్తుండగా, ఇందుకు అవసరమైన నీటిని గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా అందిస్తున్నారు. ఓ పక్క జనం నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, ఇలా ట్యాంకర్‌ను దుర్వినియోగం చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆటలు నేర్చుకుందాం



క్రీడా శిబిరాల నిర్వహణకు సమాయత్తం

మే 1 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపులు

గ్రామీణ ప్రాంతాల్లో 10, పట్టణ ప్రాంతాల్లో 12 శిబిరాలు

యువజన-క్రీడల శాఖ ఆధ్వర్యంలో శిక్షణ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బాల్యం నాలుగు గదులకే పరిమితమై బరువెక్కుతున్నది. ఆటల్లేవ్.. ఆడుకోవడాల్లేవనే చందంగా నేటి పిల్లలు, యువత సెల్‌ఫోన్లలోని గేమ్స్‌లో మునిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏటా మే నెలలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వేసవిలోనూ క్రీడా శిబిరాల నిర్వహణకు సమాయత్తం అవుతున్నారు.

నెల రోజుల పాటు

జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు ఉదయం 6నుంచి 9గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్రీడా శిబిరాలు నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాల్లో క్యాంపు నిర్వహణకు అర్హులైన సీనియర్, జాతీయ క్రీడాకారులను, పీఈటీ, పీడీలను ఎంపిక చేశారు.



ఒక్కో ప్రాంతంలో ఒక్కో క్రీడ

సమ్మర్ కోచింగ్ క్యాంపులు గ్రామీణ ప్రాంతాల్లో 10, పట్టణ ప్రాంతాల్లో 12 నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో భాగంగా సిర్గాపూర్ మండలం అంతర్గామ్‌లో ఆత్యాపాత్య, సంగారెడ్డి మండలం గొల్లగూడెంలో బాక్సింగ్, పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో కిక్‌బాక్సింగ్, ఉత్తర్‌పల్లిలో కబడ్డీ, అంగడిపేటలో చెస్, కంది మండలం ఎద్దుమైలారం ఓడీఎఫ్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్, కంది గ్రామంలో అథ్లెటిక్స్, అందోల్ మండలం మాసన్‌పల్లిలో కబడ్డీ, పటాన్‌చెరు మండలం లక్డారంలో బాక్సింగ్, నారాయణఖేడ్ మండలం జుజుల్‌పూర్‌లో ఫుట్‌బాల్ క్యాంపులు నిర్వహించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో వచ్చేసరికి సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వుషు, బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్‌లో హాకీ, నారాయణఖేడ్‌లో కబడ్డీ, సదాశివపేటలో ఫుట్‌బాల్, శ్రీవికాస్ హైస్కూల్‌లో కబడ్డీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుట్‌బాల్, రైఫిల్ షూటింగ్, విగ్నాన్ మోడల్ స్కూల్‌లో వుషు క్రీడా క్యాంపులు నిర్వహిస్తారు. 14 ఏళ్ల లోపు వయసున్న వారు మాత్రమే ఈ శిబిరాల్లో పాల్గొనుటకు అర్హులు. పూర్తి వివరాలకు 79817 98957 నంబరును సంప్రదించాలి.



సద్వినియోగం చేసుకోవాలి

నెల రోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో ఇచ్చే శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి. సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందాలనుకునే వారు క్యాంపు ఇన్‌చార్జిలను నేరుగా వెళ్లి పేరు నమోదు చేసుకొని శిక్షణ పొందవచ్చు. వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి. తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుంది. క్రీడల్లో తమ పిల్లలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

- ఎం.ఖాసీంబేగ్, డీవైఎస్‌వో, సంగారెడ్డి

'ఇందిరమ్మ'లో అనర్హులకు లబ్ధి జరగొద్దు

ఇళ్లను త్వరగా పూర్తి చేయండి

రాష్ట్ర హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్


ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడితో మాట్లాడుతున్న హౌసింగ్ ఎండీ గౌతమ్

సిద్దిపేట కలెక్టరేట్/సిద్దిపేట రూరల్/కుకునూరుపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనర్హులకు లబ్ధి చేకూర్చవద్దని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. సిద్దిపేట ఐడీవోసీలో సోమవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రగతిపై కలెక్టర్ మనుచౌదరితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 5లక్షలతో ఇంటి నిర్మాణం ఏ విధంగా సాధ్యమన్న సందేహాన్ని తీర్చి, లబ్ధిదారుల్లో నమ్మకాన్ని కల్పించేలా ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. స్థలం ఉండి, ఇళ్లు కట్టుకునే స్థోమత లేని నిరుపేదలనే అర్హులుగా గుర్తించాలని, ఆర్థిక సహాయం కోరుకునే వారికి మహిళా సమాఖ్యల ద్వారా రుణం అందేలా చొరవ చూపాలని సచిఇంచారు. లబ్ధిదారుడు ఇందిరమ్మ ఇండ్లు అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు ఇంటి నిర్మాణ ప్రగతి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇలా చేస్తే బిల్లుల ఆలస్యం ఉండదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ కమిటీలు గుర్తించిన లబ్ధిదారులను అధికారులు మరోసారి పరిశీలించాలన్నారు. అసంపూర్తిగా, చివరిస్థాయిలోఉన్న రెండు ఎడకగదుల నిర్మాణ పనులపై మాట్లాడుతూ, వాటిని పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు, యజమానులు ముందుకు వచ్చినట్లయితే వారితో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, హౌసింగ్ పీడీ దామోదర్ రావు, డీఆర్‌డీఏ జయదేవ్ ఆర్య, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు చంద్రకళ, రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయితీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ఎండీ వీపీ గౌతమ్ పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన సిద్దిపేట రూరల్ మండలం వెంటాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో 2667 మంది లబ్ధిదారులను గుర్తించామని, ఆయా నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, గృహనిర్మాణ సంస్థ పీడీ దామోదర్‌రావు, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీవో మురళీధర్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ రాజేశం, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఉన్నారు. అలాగే, కుకునూరుపల్లి మండలంలోని మొదినీపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి, కొండపాక ఎంపీడీవోలు రాంప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వైష్ణవి



మర్కుక్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న లింగ వైష్ణవి పంజాబ్ అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ వర్సిటీ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటింది. 12 దేశాలకు చెందిన అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వై. చిన్న బ్రహ్మయ్య మార్గదర్శకంలో కేవలం ఒక నిమిషం 59 సెకండ్లలో రసాయన శాస్త్రంలోని నూతన అవర్తన పట్టిక క్రమాంకంలో ఏర్పాటు చేసి ఇంటర్నేషనల్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. ఆమెను మండల విద్యాధికారి వెంకటరాములు అభినందించగా, పాఠశాల తెలుగు భాష ఉపాధ్యాయిని ముదిగొండ మణిమాల విశ్వప్రసాద్ రూ.15 వేల నగదును అందజేసి అభినందించారు.

విహాన్‌రామ్ పేరూ..



ధూళిమిట్ట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో హనుమతండాకు చెందిన అంతర్జాతీయ బాల పర్వతారోహకుడు జాటోత్ విహాన్‌రామ్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కింది. జాటోత్ విహాన్‌రామ్ అత్యంత ఎత్తైన కిలిమంజారో(5685 మీ) పర్వతాన్ని, హిమాచల్‌ప్రదేశ్‌లోని పాతాల్సు (4250 మీ) పర్వతాన్ని అధిరోహించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన పేరును ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో ఎక్కించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి అమృత్‌సర్‌లో జరిగిన కార్యక్రమంలో విహాన్‌రామ్ తల్లిదండ్రులతో కలిసి సర్టిఫికెట్‌ను అందుకున్నాడు.

గడువుదీరిన ట్యాబ్లెట్స్ పంపిణీపై ఆరా!

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో గడువు ముగిసిన ట్యాబ్లెట్ల పంపిణీ వ్యవహారంపై కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం ఆరా తీశారు. ఓపీ ద్వా రా వచ్చిన మహిళకు గడువు తీరిన ట్యాబ్లె ట్లు ఎందుకు ఇచ్చారు? కాలం చెల్లిన మందులు నిల్వ ఉంచడమేమిటన్న కారణాలు ఆరా తీశారు. గడువు ముగిసిన ట్యాబ్లెట్ల పంపిణీ ఘటనపై ఈజేహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉన్నతాధికారులు కూడా ఆరా తీశారు. మందులు ఇచ్చిన సంబంధిత సిబ్బందిపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కలెక్టర్‌కు పూర్తి నివేదిక సమర్పించనున్నట్టు సమాచారం.

తెలుగుభాషను కనుమరుగు చేయవద్దు

తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి

కలెక్టరేట్‌లో వినతిపత్రం


కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న తెరవే ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేల ఏళ్ల నుంచి మాట్లాడే తెలుగును, మన మాతృభాషను కనుమరుగు చేయాలనుకోవడం అవివేకమే అవుతుందని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్‌లో సంస్కృతాన్ని ద్వితీయ భాషగా అనుమతించే నిబంధనకు నిరసనగా తెరవే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. శాతవాహనుల కాలం నుంచి తెలుగుభాష మనుగడలో వున్నదని, ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడేభాషల్లో తెలుగు 16స్థానంలోనూ, దేశంలో నాలుగో స్థానంలో ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భావజాలవ్యాప్తికి ఎంతగానో ఉపయుక్తమైందన్నారు. అంతేకాకుండా తెలుగుభాష సుసంపన్నమైన సాహిత్య సంపదను, చూడముచ్చటైన లిపి, అన్ని ధ్వనులను పలిగే వర్ణమాల తెలుగు భాష సొంతమన్నారు. ఇన్ని విశిష్టతలు ఉన్న తెలుగు భాష అస్తిత్వాన్ని ఎసరుపెట్టే అధికారుల నిర్ణయం విచారకమన్నారు. విద్యార్థికి మాతృభాషలోనే విద్య అందాలని, వైద్య ఇంజనీరింగ్ శాస్త్ర సాంకేతిక విద్యలు సైతం మాతృభాషలోనే బోధించాలని నూతన విద్యావిధానం చెబుతున్నదన్నారు. హైస్కూల్ వరకు తెలుగు ప్రథమభాషగా తెలంగాణలో అమలులో ఉందని, ఇంటర్.. డిగ్రీల్లో ఇందుకు విరుద్ధంగా తెలుగును కనుమరుగు చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు మహమూద్ పాషా, ప్రధాన కార్యదర్శి స్రవంతి మహిపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్కపెల్లి యాదగిరి, నరసింహారెడ్డి, ప్రవీణ్, మహేందర్, అశోక్ రాజు, స్వామి, ఉమాశంకర్, రాజు, గోత్రాల సంతోష్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు సర్వేకు నిపుణులతో కమిటీ

45 రోజుల్లో నివేదిక.. హైడ్రా కమిషనర్ రంగనాథ్


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముంపు బాధితుల జేఏసీ నాయకులు

అమీన్‌పూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు సమగ్ర సర్వే చేపట్టేందుకు నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. సోమవారం చెరువు ప్లాట్ల ముంపు బాధితుల జేఏసీ నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్య చెరువుగా గుర్తింపు పొందించిన అమీన్‌పూర్ పెద్దచెరువు విస్తీర్ణంపై నెలకొన్న అపోహలు తొలగించేందుకు నిపుణుల సహాయం కోరామన్నారు. చెరువు విస్తీర్ణం ఏటేటా పెరిగిపోవడంతో ఎఫ్‌టీఎల్, బఫర్ విస్తరించుకుంటూ వెళ్లడంతో ప్లాట్లు, ఇండ్లు, కాలనీలు ముంపుకు గురవుతున్నాయని గుర్తించామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో హుడా అనుమతులు ఉన్న కాలనీలలో ఇండ్ల స్థలాలు కొన్న వారి పరిస్థితిని అర్థం చేసుకున్నామని ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. పాత ఇరిగేషన్, రెవెన్యూ రికార్డులు, టిప్పన్‌మ్యాప్, గ్రామ నక్షాలను క్రోడీకరించి ముంపు సమస్యకు కారణాలను తెలుసుకుంటున్నామన్నారు. అమీన్‌పూర్ పెద్దచెరువు సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డ దృష్టికి తీసుకెళ్లామన్నారు. చెరువును ఒక వైపు మూసివేయడం వల్ల మరో వైపు ముంపు గురవుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధులే కాకుండా శిథిలమైన తూములు, కాల్వలను పునరుద్ధరించడంపై దృష్టి పెట్టామన్నారు. అనేక చోట్ల కాల్వలు కబ్జాలకు గురైనట్లు సంబంధింత ప్రభుత్వ శాఖల నివేదికలో పేర్కొన్నట్లు చెప్పారు. చెరువు నీటి సామర్థ్యాన్ని ఏటా స్థిరీకరించేందుకు తూములను వదలాలన్న డిమాండ్ నెలకొందన్నారు. వరద నీటితో పాటు నిత్యం కలిసే డ్రైనేజీ నీటితో నీటి మట్టం పెరుగుతున్న సమస్యకు పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. సాంకేతికంగా చెరువు విస్తీర్ణం నిర్ణయించేందుకు ఐఐటీ హైదరాబాద్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ), సర్వే ఆఫ్ ఇండియా నిపుణుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సమగ్ర సర్వే చేస్తుందని వివరించారు. 45 రోజుల్లో సర్వే పూర్తి చేసి, నివేదికను సమర్పించిన తరువాత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని రంగనాథ్ చెప్పారు. నిపుణుల కమిటీకి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తారన్నారు. సర్వే అనంతరం పెద్ద చెరువు ముంపు బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జీవవైవిధ్య చెరువును కాపాడటంతోపాటు నిజమైన బాధితులకు న్యాయం చేయడమే తమ ఉద్దేశమని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్‌తో సమావేశమైన వారిలో జేఏసీ ఛైర్మన్ చిరునామా సత్యనారాయణ, సభ్యులు సంజయ్‌కుమార్, టీవీ.రావు, జీవ, నాగభూషన్‌రావు, సత్యనారాయణ, రామకృష్ణ, రంగరాజు, రవీందర్, కృష్ణకుమార్, కాసులపెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

70 వేల నాణెలతో తిరుపతి వెంకన్నకు మొక్కు

కూచనపల్లి నుంచి బయలుదేరిన భక్తుడు

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓ భక్తులు 70 వేల నాణెలతో తిరుపతి వెంకన్నకు మొక్కు చెల్లించుకునేందుకు బయలుదేరాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామానికి చెందిన పైడిద్ద రాజు తన భార్య ఆరోగ్యం నయం కావాలని 2019లో వేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నాడు. కరోనా సమయంలో రక్తకణాలు తగ్గి ఆస్పత్రిలో ఉండగా ఆమెకు నయం అయితే, ఆమె ఎత్తు నాణెలు సమర్పిస్తానని మొక్కుకున్నాడు. అప్పట్లోనే అతని భార్య బరువును తూకం వేయగా, 93 కిలోలు వచ్చింది. భార్య ఆరోగ్యం కుదుట పడటంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదేళ్ల పాటు పైడిద్ద రాజు వివిధ నాణెలను పోగు చేశాడు. అవి మొత్తం 70 వేల నాణెలు అయ్యాయి. వాటి లెక్క సరిచూసుకున్న పైడిద్ద రాజు సోమవారం తిరుపతి వేంకటేశ్వరునికి మొక్కు చెల్లించుకునేందుకు భార్యాపిల్లలతో కలిసి తిరుపతి బయలుదేరాడు. 70 వేల నాణెలను మూటలుగా కట్టి వాటిని తీసుకుని వెళ్తున్నారు. నాడు తాను మొక్కుకున్న తర్వాత అంతా మంచే జరిగిందని, అందుకోసమే స్వామివారికి మొక్కుకున్న విధంగా నాణెలతో మొక్కు చెల్లించుకునేందుకు వెళ్తున్నానని ఈ సందర్భంగా రాజు తెలిపారు.


పైడిద్దరాజు పోగు చేసిన నాణెలు

మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలి

సిద్దిపేట అంధ్రజ్యోతి, ఏప్రిల్ 21: మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సోమవారం పర్యటించారు. పట్టణంలోని 11వ వార్డులో మురికి కాలువల్లో కవర్లు, సిల్ట్ వల్ల నీరు నిలిచిపోవడం గమనించి, వెంటనే మురుగు కాలువల్లో సిల్ట్ తొలగించాలన్నారు. ఓ దుకాణం బయట చెత్తను గమనించి, దుకాణ యజమానిని పిలిపించి చెత్తను అక్కడినుండి తీసి వేయించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తాం

- జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి పి క్రిస్టోఫర్



హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏదైనా మోటర్, వాహనాలు నడిపే వారు అన్నిరకాల పేపర్లు, లైసెన్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని లేని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ (డీటీవో) పి క్రిస్టోఫర్ హెచ్చరించారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లో మాట్లాడారు. జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాల, దుబ్బాక పరిధిలోని వాహనదారులు ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. అలాగే స్కూల్ వాహనాలు ప్రైవేట్ ఫంక్షన్లు, పెళ్లిలకు పంపవద్దన్నారు. ఒక వేల నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే మోటారు వెహికిల్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సుభాష్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

సిద్దిపేట అంధ్రజ్యోతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని సుభాష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో కాలనీ వాసులకు సోమవారం ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలనీవాసులకు బ్లడ్ కొలెస్ట్రాల్, షుగర్ టెస్టులు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మిరుదొడ్డి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక చట్టాలను కేంద్రప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గోపాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మే20న జరిగే సార్వత్రిక సమ్మెపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా వచ్చేనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లం, శ్రీనివాస్, ఎల్లం, స్వామి, నాగేందర్, బాలపోశయ్య తదితరులున్నారు.

పాత పనులకు కొబ్బరికాయలు కొట్టడం విడ్డూరం

గజ్వేల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులవి చిల్లర రాజకీయాలని 3వ వార్డు మాజీ కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి-కనకయ్య విమర్శించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో తమ పాలకవర్గం ఉన్నప్పుడే కొబ్బరికాయలు కొట్టామని, తీర్మానం చేయించడంతో పాటు మంజూరు, టెండర్ ప్రక్రియ పూర్తి చేయించామన్నారు. కానీ కొత్తగా కాంగ్రెస్ నాయకులు వచ్చి తామే చేశామన్నట్లు కొబ్బరికాయలు కొట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే గతంలో మంజూరై, కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన రూ.170 కోట్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు.

సాంద్రానందాశ్రమంలో ఘనంగా అరుణ పారాయణం



పారాయణం చేస్తున్న రుత్విక్కులు

చేర్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో ఆధ్యాత్మికక్షేత్రం సాంద్రానందాశ్రమంలో సోమవారం ఘనంగా మహా నారాయణ, అరుణపారాయణం జరిపారు. భానుసప్తమిని పురస్కరించుకుని లోకకల్యాణార్థం ఆశ్రమంలో రుత్విక‌బృందం పారాయణం చేశారు. నామమంత్ర పఠనంతో ఆశ్రమపరిసరాలు ప్రతిధ్వనించాయి.

సీసీ రోడ్డును నిర్మించాలి



కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలనీవాసులు

గజ్వేల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో సీసీ రోడ్డును పూర్తిగా నిర్మించాలని కోరుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రజలు కమిషనర్ గొల్కొండ నరసయ్యను కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, సీపీఐ నాయకులు రాజేశం, కాలనీ వాసులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ

- ఇళ్ల మధ్యనే మురుగునీరు
- ప్రజా ప్రతినిధుల నుంచి ప్రత్యేకాధికారుల పాలన వచ్చినా మారని తీరు
- వెల్కటూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద దుర్వాసనతో ఇక్కట్లు



నివాసాల మధ్య మురుగునీటి కాలువలు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మురుగునీరు అస్తవ్యస్తంగా ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో మురుగునీరు వెళ్లడానికి ఎటువంటి కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే నీళ్లతో పాటు వర్షం తాకిడికి వచ్చే నీళ్లు అక్కడే ఒక చోట కుంటలుగా ఏర్పడి దుర్గంధం వెదజల్లుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దోమలు, ఈగల బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువల పక్కనే చిన్నారులు ఆడుకోవడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఏళ్లు గడిచినా మురుగునీటి కాల్వలు నిర్మించడంలో గ్రామపంచాయతీ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. దీంతో స్థానికంగా అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్యపై అనేకసార్లు విన్నవించుకున్నా వారు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రత్యేక అధికారుల పాలన వచ్చిన తర్వాత కూడా ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ద్వారా వాళ్ల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. కాలువలు నామమాత్రంగా నిర్మించి, నిర్వహణలోకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు చెబుతున్నారు

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి



తొగుట రైతువేదికలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

తొగుట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి, నూతన ఆర్వోఆర్ చట్టాన్ని రూపకల్పన చేసిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. సోమవారం తొగుట రైతు వేదికలో భూ భారతి చట్టంపై ఆర్డీవో సదానందంతో కలిసి రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. చట్టంలోని వివిధ అంశాలను రైతులకు, ప్రజలకు పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించి మాట్లాడారు. జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు అధికారాలు అప్పగించినట్టు తెలిపారు. ఆర్డీవో, కలెక్టర్‌ల నిర్ణయం నచ్చకపోతే భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో 10వేల 954 రెవెన్యూ గ్రామాలకు గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలన అధికారులను, అదే విధంగా 8 వేల మంది లైసెన్స్ కలిగిన సర్వేయర్‌లను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. మనిషికి ఆధార్ లాగా భూమికి భూధార్ సంఖ్య కేటాయించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, మండల స్పెషలాఫీసర్ (దుబ్బాక ఏడీఏ అగ్రికల్చర్) మల్లయ్య, ఇంచార్జి తహసీల్దార్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌క్వార్టర్ నుంచి అంబులెన్స్ తరలించొద్దు

మద్దూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా హెడ్‌క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన అంబులెన్స్ సౌకర్యాన్ని ఇతర గ్రామాలకు తరలించాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి రజితకు గ్రామస్థులు విన్నవించారు. ఈ విషయమై గ్రామస్థులు మాట్లాడారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా గదిని సబ్‌సెంటర్ నిర్వహణకు అందించినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం మండల కేంద్రాలకు అంబులెన్స్ సౌకర్యాలను కల్పించడంతో అధికారుల, ఎమ్మెల్యే సూచనల మేరకు సబ్‌సెంటర్‌లోనే తాత్కాలికంగా అంబులెన్స్ డ్రైవర్లు బసచేసేందుకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలో సబ్‌సెంటర్ నుంచి సిబ్బందిని పంపించే ఏర్పాటు చేస్తూ అంబులెన్స్‌ను పక్క గ్రామాల్లో ఉండే విధంగా షిఫ్ట్ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు గ్రామస్థులకు సమాచారమందింది. దీంతో తాము వైద్యాధికారి రజితను సంప్రదించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇక్కడ నుంచి 108 అంబులెన్స్ తరలించొద్దని విన్నవించారు.

అంగడికిష్టాపూర్‌లో మొక్కలు నాటిన హరితసేన



రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

మర్కుక్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన హరితసేన ఆధ్వర్యంలో మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో మొక్కలు నాటారు. అంగడికిష్టాపూర్ మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మి రాములుగౌడ్, హరితసేవ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి చెప్యాల రాజేశ్వరరావు నేతృత్వంలో 25 మొక్కలు నాటి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో హరితసేన రాష్ట్ర కోఆర్డినేటర్ గర్నేపల్లి సతీష్, గజ్వేల్ హరితసేన ఇన్‌చార్జి అనిల్ మొగిలి, మాజీ జడ్పీటీసీ రామచంద్రం, మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నిరంతర ఇన్నోవేషన్, అప్‌గ్రేడ్ అవసరం



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ ఇన్నోవేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆవిష్కరణ దినోత్సవం (వరల్డ్ ఇన్నోవేషన్ డే)ను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కృషికల్ప సీఈవో సీఎం పాటిల్ హాజరై కీలకోపన్యాసం చేశారు. నిరంతర ఆవిష్కరణ, అప్‌గ్రేడ్ ప్రాముఖ్యతను వివరిస్తూ పలు ఉదాహరణలతో వివరించారు. ఆవిష్కరణ అంటే పూర్తిగా కొత్త ఉత్పత్తిని సృష్టించడం కాదని, బదులుగా, ఉన్న ఉత్పత్తులలోని లోపాలను గుర్తించడం, పరిష్కరించడం కూడా గొప్ప ఆవిష్కరణలకు దారితీస్తుందన్నారు. విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, ఆయన విద్యార్థులను పిచ్ యువర్ ఐడియా పోటీలో పాల్గొనమని ఆహ్వానించారు. ఉత్తమ ఆలోచనకు నగదు బహుమతిని అందజేస్తామని, వినూత్న ఆలోచనలకు మద్దతు ఇచ్చే కృషికల్ప ఎన్‌జీవో నుండి నిధులు కూడా పొందవచ్చని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు నిశితంగా పరిశీలించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్, ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. అయోధ్యరెడ్డి, అంత్రపెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ గురుచరణ్ దాస్ అడెపు మాట్లాడుతూ రోజువారీ జీవితం ఆవిష్కరణలకు అనేక అవకాశాలను అందిస్తుందని చెప్పారు. అంతకుముందు ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.

రజతోత్సవ సభకు తరలిరండి

కోహెడ/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం నుంచి వేలాదిమంది ప్రజలు బీఆర్ఎస్ బహిరంగ సభకు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గవ్వ వంశీధర్ రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను మాజీ జడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు తదితరులున్నారు. అదేవిధంగా జగదేవ్‌పూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ యువనేత దాచారం కనకయ్య మాట్లాడుతూ.. ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

సభ కోసం కూలీ పని చేసిన నాయకులు



సిద్దిపేట పట్టణంలోని మిల్లులో కూలీ పని చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట అంధ్రజ్యోతి, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల దారి ఖర్చులకు సిద్దిపేట వర్తక వ్యాపారులు అందించిన సహకారం మరువలేనిదని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేటలోని నందిని శ్రీనివాస్ రైస్‌మిల్లులో, సిద్దిపేట ట్రాన్స్‌పోర్ట్, ఎస్ఆర్ సీడ్స్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి డైయిరీఫామ్‌లో బీఆర్ఎస్ నాయకులు కూలీ పని చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నందిని శ్రీనివాస్ మిల్లులో కూలీ పనిచేసినందుకు రూ. లక్ష, ఎస్ఆర్‌సీడ్స్ కూర శ్రీనివాస్ రూ. 50వేలు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి 5వేలు, సిద్దిపేట ట్రాన్స్‌పోర్టు రూ. 2 వేలు విరాళం గా ఇచ్చారన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో పోషణ పక్వాడ ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

సిద్దిపేట రూరల్/సిద్దిపేట కల్చరల్/చేర్యాల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గర్భిణులు, బాలింతల, చిన్నారుల అవసరమైన పౌష్టికాహారంపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు పౌష్టికాహారం, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత మాట్లాడుతూ.. గర్భిణిలు, బాలింతలు మంచి పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఆరుణ, అంగన్‌వాడీ కర్యకర్తలు చిలుక, రేణుక,అంజమ్మ, గర్భిణులు, బాలింతలు, పిల్లలు తదితరులుత పాల్గొన్నారు. సిద్దిపేట పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అలాగే ప్రైమరీస్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పిల్లలకు ప్రోగ్రెస్ కార్డ్స్ అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బింగి బాల్‌లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎమ్‌లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు. చేర్యాల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, బాలింతలకు సీమంతం జరిపారు. అనంతరం పోషకాహార ఆవశ్యకతను వివరించి ప్రతిజ్ఞ జరిపించారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, కొమురవెల్లి సూపర్‌వైజర్ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఏమైనా సాధించవచ్చు

కొండపాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి చదువుపై శ్రద్ధ పెట్టి కష్టపడి చదివితే మనం ఏదైనా సాధించవచ్చని కొండపాక గ్రామానికి చెందిన ఐఏఎస్ బుద్ధి అఖిల్ పేర్కొన్నారు. కొండపాక బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి తో పాటు పలువురు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బుద్ధి అఖిల్ మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుంచి కష్టపడి ఐఏఎస్ కావాలని ఆ దిశగా చదివి సాధించానని తెలిపాడు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ నాయక్, ఉపాధ్యాయులు రామస్వామి, రఘువర్ధన్‌రెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థులు మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య పారిశ్రామిక వేత్త బాలకృష్ణారెడ్డి, న్యాయవాది సంజయ్ కృష్ణ, జానకిరామ్ రెడ్డి, బాలచందర్ గౌడ్, రఘు రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్రీడలకు రోజూ కొంత సమయం కేటాయించాలి

సిద్దిపేట రూరల్,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ క్రీడలకు కొంత సమయం కేటాయించి సాఫ్ట్ బాల్ నేర్చుకోవడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు పొందడంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతి కైలాసం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ తోట సతీష్ నాయకత్వంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరాన్ని మే 31 వరకు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7;30 వరకు కొనసాగుతుందని తెలిపారు.

కొడకండ్ల పాఠశాలలో సమ్మర్ క్యాంప్

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి మే 15 వరకు గజ్వేల్ మండలం కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మండల విద్యాధికారి కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు మదునాల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల విద్యాధికారి కృష్ణ చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ క్యాంపులో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఒకటి నుంచి 5వ తరగతి వరకు నూతనంగా అడ్మిషన్‌లు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంజయ్య యాదవ్, అశోక్, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, మహేందర్‌రెడ్డి, భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 21మందికి జరిమానా.. ఒకరికి జైలు

గజ్వేల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 21 మందికి కోర్టు జరిమానా విధించింది. నిందితుల్లో ఒకరికి జరిమానాతో పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపిన వివరా ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని సోమవారం గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం నిందితులకు రూ.15 వేల జరిమానా విధించారు. అందులో ఒకరికి 3 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రైతుల సౌలభ్యం కోసమే కొనుగోలు కేంద్రాలు



గుడికందులలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

తొగుట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సౌలభ్యం కోసమే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తొగుట పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుడికందుల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. మండలంలో ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా 17 గ్రామాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, సొసైటీ సీఈవో గంగారెడ్డి, నాయకులు భైరారెడ్డి పాల్గొన్నారు.

మునిసిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.5 కోట్లు మంజూరీ చేయగా, సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వారితో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్నగారి రాజు, నక్క రాములుగౌడ్, నాయకులు తదితరులున్నారు.

సీతారామ, ఉమామహేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువైన సీతారామ, ఉమామహేశ్వరస్వామి విగ్రహాలు

గజ్వేల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో 800 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ సీతారామ, ఉమామహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ఓవైపు రామాలయంలో వైష్ణవ ఆచార్యుల, మరోవైపు శివాలయంలో శైవుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు కన్నులపండువగా కొనసాగాయి. రామాలయంలో సుదర్శనాచార్యులు వైదిక నిర్వాహణలో ప్రధాన అర్చకులు బిటుకూరి శ్రీనివాసాచార్యులు, వరుణాచార్యులు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆలయంలో వాసుదేవ పుణ్యాహవచనము, ధ్వజారోహణం నిర్వహించగా, శివాలయ అర్చకులు మఠం వీరభద్రయ్య ఆధ్వర్యంలో వీరశైవులు ఉమామహేశ్వరునికి రుద్రాభిషేకం, భేరీ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీరామనవమి అనంతరం వచ్చే బహుళ నవమి రోజున సీతారాముల, శివపార్వతుల కల్యాణాన్ని ఇక్కడ నిర్వహిస్తారు. భద్రాచల శ్రీరాముల వారి కల్యాణంలోని ముత్యాల తలంబ్రాలను తీసుకువచ్చి ఈ వేడుకను నిర్వహిస్తారు. మంగళవారం జరిగే కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



రాంసాగర్ రామాలయంలో సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

రాయపోల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంసాగర్ గ్రామంలో నిర్వహిస్తున్న రామాలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 22న ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నంగునూరు: నర్మేటలో బడిబాట ర్యాలీలో విద్యార్థులతో ఎంఈవో దేశిరెడ్డి

నంగునూరు/చేర్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని నంగునూరు ఎంఈవో దేశిరెడ్డి, కొమురవెల్లి ఎంఈవో రమేశ్ పేర్కొన్నారు. సోమవారం నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మనీష్ కుమార్ తో కలిసి బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు రెండు జతల స్కూల్ డ్రెస్సులు, మధ్యాహ్న భోజనం, అన్ని విధాలా సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలో పిల్లలను చేర్పించి డబ్బులు వృథా చేసుకోవద్దని గ్రామస్థులకు సూచించారు. ఈ మేరకు గ్రామంలో విద్యార్థులచే ర్యాలీని నిర్వహించారు. అంతకు ముందు పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే, 7వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల బడిబాట కరపత్రం ఆవిష్కరించారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతాలోపం

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు నాణ్యత లేమితో చేస్తున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులకు వాటర్ క్యూరింగ్ చేయడం లేదని, మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని ఆరోపించారు.